

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 124 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 04, ఏప్రిల్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# శిలువ త్యాగంలో.. లోక రక్షణ!



- యేసు సిలువలో కార్చిన రక్తంలో ఎంతో పవిత్రత దాగివుంది
- పాపుల కొరకు ప్రాణత్యాగం చేసిన ఏకైక దేవుడు యేసు
- మానవ రూపంలో దైవాన్ని ప్రదర్శించిన ఏకైక దైవమూర్తి
- యేసుక్రీస్తు సిలువ మరణానికి సాక్షాత్తు ఆధారాలు ఉన్నాయి
- సిలువలో కార్చిన రక్తంలో ప్రపంచ మేల్కొలుపు దాగివుంది
- పాపులను రక్షించడం కోసమే సిలువలో రక్తం కార్చాడు
- గుడ్ ఫ్రైడే అంటేనే పాపుల కొరకు సిలువలో చిందించిన రక్తం
- ప్రపంచంలోని అన్ని దేశాలు యేసుక్రీస్తు సిలువ త్యాగాన్ని ధ్యానం చేస్తున్నాయి
- సిలువపై యేసుక్రీస్తు శరీరం పచ్చి రక్తపుమాంసపు ముద్దవలే తయారయింది
- ప్రపంచ మానవాళి రక్షణార్థం క్రీస్తు సిలువలో మరణించాడు : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

యేసుక్రీస్తు సినిమాలో కార్చిన రక్తం ప్రపంచ మానవాళిని పాపంలో నుండి రక్షణలోనికి నడిపించిందని డాక్టర్ బరిగెల శివ తన విశ్వాసాన్ని తెలిపారు. లోకంలోని పాపమంత మోయలేని భారంగా,భరించరాని నేరం మోయాల్సి వచ్చినప్పుడు యేసుక్రీస్తు సిలువలో తన చివరి రక్తం బొట్టు వరకు కార్చి సమస్త లోకంలోని మానవాళిని రక్షించడం కోసం ముఖ్యంగా పాపుల కోసం సిలువలో ప్రాణత్యాగం చేసిన ఏకైక దేవుడుగా ప్రపంచ దేశాలు గుర్తించడాన్ని ఎంతో గర్వంగా అనుభూతిని పొందాల్సి ఉందని అన్నారు. యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరిస్తున్న క్రైస్తవులు గాని క్రైస్తవ బోధకులు గాని యేసుక్రీస్తు ఏ విధంగా సిలువ మరణం పొందాడో అదే రీతిగా లెక్కలేనంతమంది హతసాక్షులుగా యేసుక్రీస్తు కోసం మరణం పొందుతుండడం ప్రపంచంలో వెలకట్టలేని చరిత్ర అన్నారు.ఒక దేవుణ్ణి ఆరాధించడం అంటే ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా విశ్వాసం కనబరచడం అనేది కేవలం ఒక క్రైస్తవంలోనే చూడగలమని అలాంటి విశ్వాసాన్ని కనపరుస్తున్న క్రైస్తత్వం ప్రపంచ దేశాలను ఐక్యపరుస్తుందని గుర్తు చేశారు. ప్రపంచంలోని అన్ని దేశాలు శుభశుక్రవారం దినాన్ని ఘనంగా నిర్వహించుకుంటూ మేసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు

- మిగతా 2లో..









## 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జై భీమ్ న్యూస్


2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. "మీకు విజన్

- మిగతా 2లో..



## కార్బైడ్ మామిడి పండ్లతో జాగ్రత్త

సీపీ సజ్జనార్ కీలక హెచ్చరిక



2


## ఐఏఎస్ అధికారిణి కుమారుడికి డ్రగ్స్ పాజిటివ్ ! తనకు నెగెటివ్ వచ్చిందన్న హేమ

2

## టీఆర్ఎస్ పేరును ఇప్పుడు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు: కవిత



2



## తెలంగాణలో మూడు రోజుల పాటు మోస్తరు వర్షాలు

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడవచ్చని, ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# లంబాడీల భూములు లాక్కొని జైల్లో పెట్టారు: హరీశ్ రావు



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

నారాయణపేట జిల్లా బావోజీ జాతరలో పాల్గొన్న మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గిరిజనుల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషిని వివరిస్తూ, ప్రస్తుత పాలనలో గిరిజనులకు అన్యాయం జరుగుతోందంటూ మండిపడ్డారు. గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దేనని, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనులకు స్వపరిపాలన అందించారని కొనియాడారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్టీల కోసం బడ్జెట్‌లో రూ. 2,730 కోట్లు కేటాయించి, కేవలం రూ. 50 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గిరిజనులను వంచించడమేనని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లగచర్లలో లంబాడీల భూములను బలవంతంగా లాక్కుని వారిని జైల్లో పెట్టారని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే అక్కసుతోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ప్యాకేజీ-3 పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమస్యలను గాలికొదిలేసి ముఖ్యమంత్రి కేరళలో గొప్పలు చెప్పుకుంటున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు.

# ఐఏఎస్ అధికారిణి కుమారుడికి డ్రగ్స్ పాజిటివ్ !

### తనకు నెగెటివ్ వచ్చిందన్న హేమ



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్‌లోని కొండాపూర్ క్వాక్ ఏరీనా పబ్‌లో డ్రగ్స్ కలకలం చెలరేగింది. 64 మందికి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి గంజాయి పాటిజివ్, ఇద్దరికి డ్రగ్స్ పాటిజివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన ఎనిమిది మందిలో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళా ఐఏఎస్ అధికారి కుమారుడు కూడా ఉన్నారని తెలుస్తోంది. పోలీసులు వీరిని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. క్వాక్ ఎరీనా పబ్ డ్రగ్ కేసులో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. క్వాక్ ఎరీనా క్లబ్‌లో 'బ్లాక్ కాఫీ' పేరిట ఈవెంట్ జరిగింది. ఈవెంట్‌లో దాదాపు 1,500 మంది పాల్గొన్నారు. ఈ సమయంలో అక్కడకు వచ్చిన ఈగల్ టీమ్ అధికారులు డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. 'బ్లాక్ కాఫీ' ఈవెంట్ జరుగుతున్న చోటుకు వెళ్లి పరీక్షలు నిర్వహించగా ఎనిమిది మందికి పాజిటివ్ వచ్చింది. క్వాక్ ఎరీనా క్లబ్ పబ్ ఈవెంట్ లో ప్రముఖ సినీ నటి హేమ కూడా పాల్గొన్నారు. పరీక్షల్లో ఆమెకు నెగిటివ్ వచ్చింది. తనకు డ్రగ్ పరీక్షల్లో నెగిటివ్ వచ్చినట్లు నిర్ధారించిన కిట్‌ను ఆమె చూపిస్తూ వీడియో విడుదల చేశారు.

# రేవంత్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి.. మార్పు రావాలి: జీవన్ రెడ్డి



హైదరాబాద్, జై భీమ్ న్యూస్

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన ప్రారంభమై రెండేళ్లు కాకముందే "ఈ ప్రభుత్వం పోవాలి.. మార్పు రావాలి" అనే పరిస్థితి ఏర్పడిందని జీవన్ రెడ్డి విమర్శించారు. గతంలో కేసీఆర్ పాలనపై వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని, కానీ ఇప్పుడు అదే తరహా అసంతృప్తి రేవంత్ ప్రభుత్వంపై కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకునేందుకే నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేవలం రాజకీయ విమర్శలే తప్ప, పునరుద్ధరణ పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని జీవన్ రెడ్డి మండిపడ్డారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల పునరుద్ధరణకు కేవలం రూ. 500 కోట్లు ఖర్చవుతాయని, కానీ ప్రభుత్వం ఎన్డీఎస్ఏ నివేదికను కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రాణహిత జలాల వినియోగంలో ప్రభుత్వం విఫలమైందని, బడ్జెట్‌లో కేవలం రూ. 152 కోట్లు కేటాయించడం నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ధ్వజమెత్తారు. మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకపోతే 18 లక్షల ఎకరాల సాగుభూమి ఎడారిగా మారుతుందని, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. భవిష్యత్ రాజకీయ నిర్ణయాలపై స్పందిస్తూ, త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటానని జీవన్ రెడ్డి తెలిపారు. తనపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన... మరో రెండు వారాల్లో ఏ పార్టీలో చేరబోతున్నానో అధికారికంగా ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

# సిలువ “త్యాగంలో “లోక రక్షణ

మొదటి పేజీ తరువాయి

మాటలను ధ్యానం చేసుకుంటూ ఆరాధనలు చేసుకుంటూ వాళ్ల విశ్వాసాన్ని బలపరచుకోవడం ఒక క్రైస్తవంలోనే చూడగలమన్నారు.ప్రపంచంలో శాంతి నెలకొల్పబడాలని,ప్రపంచంలో బలహీన వర్గాలకు రక్షణ లభించాలని ప్రపంచంలో క్రీస్తు సువార్త ప్రకటించబడాలని ప్రపంచంలో అణగారిన ప్రజలకు నిత్యవసరాల పరిచర్యలు చేయబడాలని ప్రపంచ వ్యాప్తంగా కొన్ని వేలకోట్ల సంఘాలు శాంతి ర్యాలీలు నిర్వహిస్తుండడం యేసుక్రీస్తు సిలువ త్యాగాన్ని ప్రపంచానికి చాటి చెప్పేదిగా గుర్తించగలమన్నారు. సరిగ్గా 2026 సంవత్సరాల క్రితం యేసుక్రీస్తు మానవాళిగా ఈ లోకంలో జన్మించడం బైబిల్ గ్రంథం లేఖనాలను అమలుపరచడం సిలువ మరణం ద్వారా లోకానికి తనకు తాను దేవుడని తెలియజేయడం ప్రపంచంలోని ప్రతి వ్యక్తి దానిని గుర్తించిన గుర్తించకపోయినా ఇజ్రాయిల్ దేశంలో ఇప్పటికీ యేసుక్రీస్తు పొందిన సిలువ మరణం గుర్తులు సాక్షాలు ప్రత్యేకించి ఏర్పాటు చేయబడి ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేవునిగా సుమారు 280 కోట్లకు పైగా తనపై విశ్వాసాన్ని ప్రకటించే దేవునిగా గుర్తింపు సాధించారంటే కేవలం అదంతా తన సిలువ త్యాగంలో కార్చినటువంటి రక్తం లోక పాపాన్ని తన భుజస్కంధాలపై మోసుకొని గోల్గోత కొండపై ప్రపంచమంతా చూస్తుండగా యేసు పొందిన మరణం ఒక్కసారిగా ప్రపంచ కాలమాన పట్టికను తన పేరుతో లిఖింపజేసేలా చేసిందని గర్వపడ్డారు.గుడ్ ఫ్రైడే సందర్భంగా స్వార్థం, నిస్వార్థాలను పక్కనపెట్టి పాప, పుణ్యాలను పక్కనపెట్టి విశ్వాసం, అవిశ్వాసం పక్కనపెట్టి క్రైస్తవులు, క్రైస్తవేతరులు అనే భేదం లేకుండా ప్రపంచ మానవాళి కొరకు సమస్త జనుల కొరకు సిలువలో తన చివరి రక్తం బొట్టు వరకు కారుస్తూ మరణం పొందడం అనేది ప్రపంచ చరిత్రలో ఎక్కడ లేదన్నారు.భూమి ఆకాశం నిర్మింపబడినది మొదలుకొని స్వార్థంతో కూడిన ఆచారాలు మాత్రమే లోకవ్యాప్తంగా బలపరచబడుతుండగా కేవలం యేసుక్రీస్తు మాత్రమే తనే మార్గము తనే సత్యము అనే జీవము అనే బలమైన విశ్వాసాన్ని సమస్త మానవాళిలో బలంగా నింపగలిగినాడని గుర్తు చేశారు.మరణించిన మానవులను మానవ రూపంలో ఉన్న దైవ శక్తి కలిగిన యేసుక్రీస్తు తిరిగి లేపడం కేవలం గ్రంథాల్లోనే కాకుండా భౌతికంగా ఇప్పటికీ ఇజ్రాయిల్ దేశంలోని ప్రత్యేక ప్రదేశంలో చూడగలమని అలాంటి సాక్షాలు ప్రత్యక్ష పరచబడినందునే యేసుక్రీస్తును ప్రపంచమంతా నిజమైన దేవునిగా కొనియాడుతున్నారని గర్వపడ్డారు.సమస్త మానవాళికి సమాన ప్రాధాన్యతను ఇవ్వడంతో పాటు యేసుక్రీస్తు చూపించిన మార్గాన్ని బలంగా విశ్వసించడం కోసం క్రైస్తవ సమాజం ఎంతో కట్టుదిట్టమైన విశ్వాసంతో ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ తరుణంలోనే దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలుపుతూ ఉండటంతో పాటు ఈ పవిత్ర దినం దేశంలో సమానత్వం సామరస్యం కరుణ క్షమా గుణాలను మరింత పెంపొందించబడే విధంగా క్రీస్తు బోధలు యేసు సిలువ మరణము సహకారంగా నిలవాలని ఆకాంక్షిస్తూ ఢిల్లీలోని ప్రముఖ ప్రఖ్యాత గాంచిన క్యాథలిక్ చర్చిలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించి గుడ్ ఫ్రైడే సందర్భంగా దేశ ప్రజలకు తన ప్రత్యేక శు భాకాంక్షలు తెలియజేయడం శోచనీయమన్నారు. కులాలకు మతాలకు జాతులకు సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రజలు అన్ని మతాల ప్రజలు సమానత్వంతో ఐక్యతతో దేవుని ఆరాధించుకోవడానికి ఏకైక మార్గం క్రైస్తవ సంఘాలేనని ప్రత్యేకించి తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా ఏ క్రైస్తవ సంఘంలోనైనా ఎవరికైనా ఆహ్వానాలు ఉంటాయని ఎక్కడ అడ్డంకులు లేకుండా సమస్త జనులు ఐకమత్యంగా ఆరాధించుకోవడానికి క్రైస్తవ సంఘాలు అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు.ప్రపంచ దేశాలతో సరిపోల్చి చూసినప్పుడు భారతదేశంలో విభిన్నమైన పరిస్థితులు క్రైస్తవత్వం పై దాడులు చేస్తున్నప్పటికీని కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాల సహకారం లేకపోయినప్పటికీ యేసుక్రీస్తు పై క్రైస్తవుల విశ్వాసం ఏమాత్రం తగ్గకపోవడానికి కేవలం క్రీస్తును విశ్వాసంగా కొనియాడుతున్న క్రైస్తవుల విశ్వాసం ఎంతో బలమైనదన్నారు.ముఖ్యంగా క్షమాపణ గుణం అనేది ప్రపంచంలో క్రైస్తవులకు మించి ఎక్కడా కనిపించదని ఒక్కానించి చెప్పారు.తగ్గింపు స్వభావంలో కూడా క్రైస్తవులది అందవేసిన చేయి అని ప్రత్యేకించి అభినందించారు.చాలా ప్రాంతాల్లో క్రైస్తవులపై క్రైస్తవ సంఘాలపై క్రైస్తవ పాస్టర్లపై క్రైస్తవ కుటుంబీకులపై రక్తాలు కారేల చర్చిలను కూల్చేలా దాడులు జరుగుతున్నప్పటికీ శాంతియుతమైన పోరాటాలను మౌనమైన పోరాటాలను కొనసాగిస్తూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా యేసుక్రీస్తు పై విశ్వాసాన్ని కనపరుస్తున్నారంటే కేవలం అది క్రైస్తవులకున్న బలమైన విశ్వాసం అని గుర్తించాలన్నారు.భూమి నిర్మాణం దాల్చినది మొదలుకొని ఎలాంటి పాపం చేయకుండా ఎలాంటి తప్పు చేయకుండా మానవ రూపంలో దైవత్వాన్ని కొనసాగించిన ఏకైక దేవుడుగా యేసుక్రీస్తు ప్రపంచాన్ని శాసించారని ఘాఢంగా విశ్వసించాలన్నారు.తనలో పాపము ఉన్నదని ఎవరైనా నిరూపించగలరా అంటూ ప్రపంచానికి సవాల్ విసిరిన ఏకైక దేవుడు యేసుక్రీస్తు అంటూ క్రీస్తు గొప్పతనాన్ని చాటారు.దేశంలోని ప్రతి ప్రభుత్వం పైపైకి మాత్రమే క్రైస్తవులపై ప్రేమానురాగాలను కనపరచవద్దని క్రైస్తవ సమాజ రక్షణ కోసం దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రత్యేక చిత్తశుద్ధితో కట్టుదిట్టమైన చట్టాలను అమలులోనికి తీసుకురావాలని గుర్తు చేశారు.ఈ ప్రత్యేక సందర్భంలో క్రైస్తవులు కూడా సమాజాన్ని తప్పుదోవ పట్టియకుండా నిజమైన క్రైస్తవులుగా యేసుక్రీస్తు విశ్వాసకులుగా జీవించడం కోసం మాత్రమే ప్రయత్నాలు చేయాలని వ్యాపారాల్లో గాని దేవుని నామాన్ని అపహాస్యం జరిగించబడే విధంగా ఉచ్చరించకూడదని నిజమైన క్రైస్తవం అంటే ఏమిటో ప్రపంచ దేశాలు గుర్తించే విధంగా ఇంతటి గడ్డు కాలంలో కఠినమైన భారతదేశంలో కఠోరమైన విశ్వాసాన్ని కనపరుస్తూ ప్రభుత్వాల మనసు మార్చబడే విధంగా క్రైస్తవులపై దాడులు పాల్పడుతున్న వ్యక్తుల మనసులు మార్చబడే విధంగా ఏకాగ్రతతో నిత్యము విశ్వాసంతో కూడిన ప్రార్థనలు చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.క్రైస్తవులను శాసించాలని ప్రయత్నం చేస్తున్న ప్రభుత్వాల ఒంటెద్దు పోకడలు నశించబడే విధంగా క్రైస్తవ్యం అంతే స్థాయిలో బలపరచబడాలని దానికోసం క్రైస్తవులు నిరంతరం విశ్వాసకులుగా బలపడాలని పిలుపునిచ్చారు.

# 2047 నాటికి తెలంగాణను టెక్స్‌టైల్ రాజధానిగా మారుస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం" అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ డర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు. హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# బండ్ల గణేశ్ ఇంట పెళ్లి సందడి

## కుమార్తె వివాహ వేడుకలు ప్రారంభం!

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఆయన కుమార్తె జనని బండ్ల త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ శుభకార్యానికి ముందు సంప్రదాయం ప్రకారం ఇంట్లో 'పసుపు కుంకుమ' కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ విషయాన్ని బండ్ల గణేశ్ స్వయంగా తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. సూర్యతేజ చిలుకూరితో జనని వివాహం జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకకు సంబంధించిన ఫోటోలను పంచుకుంటూ ఆయన భావోద్వేగంగా పోస్ట్ చేశారు. "శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు. ఆ దేవుడి ఆశీస్సులు, మా పెద్దల దీవెనలతో త్వరలో మా ఇంట్లో జరగబోయే శుభకార్యం" అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా ఉన్న ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బండ్ల గణేశ్ సంతోషం ఈ చిత్రాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విషయం తెలిసిన సినీ ప్రముఖులు, అభిమానులు బండ్ల గణేశ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# టీఆర్ఎస్ పేరును ఇప్పుడు ఎవరైనా ఉపయోగించుకోవచ్చు: కవిత

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

తెలంగాణ రాష్ట్ర సమితి పేరును ఇప్పుడు ఎవరి చేతుల్లో లేదని, ఆ పేరును ఎవరైనా ఉపయోగించుకోవచ్చని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కవిత త్వరలో తన రాజకీయ పార్టీని ప్రకటించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి పేరు మీదనే పార్టీ పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయని చాలామంది భావించారు. ఆ తర్వాత మరిన్ని పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. తాజాగా, ఆమె చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. ఆమె మీడియాతో మాట్లాడుతూ, పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు (టీఆర్ఎస్) ఇప్పుడు ఎవరి సొంతం కాదని గుర్తు చేశారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బీహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరని అన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. పాతిక సంవత్సరాల క్రితం కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌గా మారిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచడం మధ్య తరగతి తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా మారుతోందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు. ప్రైవేటు స్కూళ్లపై ఫీజు నియంత్రణ కమిటీ వేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రతి సంవత్సరం ప్రైవేటు పాఠశాలలు 8 శాతం నుంచి 10 శాతం పెంచుకోవచ్చని, కానీ 30 నుంచి 35 శాతం పెంచితే ఎలాగని ప్రశ్నించారు.

# కార్బైడ్ మామిడి పండ్లతో జాగ్రత్త

### సీపీ సజ్జనార్ కీలక హెచ్చరిక

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

వేసవి వచ్చిందంటే చాలు, పండ్లలో రారాజైన మామిడి పండ్ల కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. అయితే, మార్కెట్లో కంటికి ఇంపుగా కనిపించే ఈ పండ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పండిస్తున్న మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలకు కీలక సూచనలు చేశారు. కొందరు స్వార్థపరులైన వ్యాపారులు, కేవలం కాసుల కక్కుర్తితో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధంగా కాకుండా, కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి మామిడి కాయలను పండ్లుగా మారుస్తున్నారని ఆరోపించారు. రోడ్డు పక్కన నిగనిగలాడుతూ, ఒకే రకమైన పసుపు పచ్చ రంగులో ఆకర్షణీయంగా కనిపించే పండ్లను చూసి మోసపోవద్దని సూచించారు. సహజంగా పండిన పండు అన్నిచోట్లా ఒకే రంగులో ఉండదని, కానీ రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండు పైన పసుపుగా ఉన్నా లోపల పచ్చిగా, రుచిహీనంగా ఉంటుందని వివరించారు. ఇలాంటి కల్తీ పండ్లను తినడం ప్రాణాంతకం కాగలదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని సజ్జనార్ తెలిపారు. వీటిని తినడం వల్ల తక్షణమే గొంతు మంట, కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ రసాయనాలు శరీరంలోకి చేరడం వల్ల దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు కూడా తలెత్తవచ్చని వివరించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇలాంటి కల్తీ వ్యాపారాలపై హైదరాబాద్ పోలీస్ విభాగం ఉక్కుపాదం మోపుతోందని సజ్జనార్ స్పష్టం చేశారు. ఇప్పటికే హెచ్-ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్) బృందాలు నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఘటనల గోలలో మాయమవుతున్న మానవత్వం




**కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-**

ప్రతి ఉదయం పత్రికలు తిరగేసినా, టీవీ ఛానళ్లను ఆన్ చేసినా, లేదా యూట్యూబ్‌లో వార్తలను వీక్షించినా మన ముందుకు వస్తున్న కథలు దాదాపు ఒకే విధంగా ఉంటున్నాయి. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హింసాత్మక ఘటనలు... అదే సమయంలో పురుషులపై జరుగుతున్న అన్యాయాలు, మానసిక, శారీరక హింసకు సంబంధించిన వార్తలు కూడా వినిపిస్తూనే ఉన్నాయి. ఇవి కేవలం వార్తల శీర్షికలు మాత్రమే కావు ఇవి సమాజంలో పెరుగుతున్న అసహనం, అసమానతలు, విలువల క్షీణతకు ప్రతిబింబాలు. మనకు తెలిసిన సంఘటనలు కేవలం పైపైకి కనిపించే మంచు పర్వతం శిఖరంలాంటివి మాత్రమే. అసలు సమస్య అంతర్గతంగా ఇంకా పెద్దదిగా ఉంది. ఎన్నో బాధితులు తమ అనుభవాలను బయటపెట్టలేక మౌనం పాటిస్తున్నారు. కారణాలు అనేకం కుటుంబ ఒత్తిడి, సమాజపు విమర్శ భయం, న్యాయం దొరకదనే నిరాశ, లేదా వ్యవస్థపై నమ్మకం కోల్పోవడం. అందువల్ల మనం వినే ప్రతి సంఘటన వెనుక, వినిపించని మరెన్నో బాధలు దాగి ఉన్నాయని అర్థం చేసుకోవాలి. ఒక ఘటన వెలుగులోకి వచ్చినప్పుడు, సమాజం ఒక్కసారిగా మేల్కొన్నట్లు కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఆగ్రహావేశాలు, హ్యాష్‌ట్యాగ్ ఉద్యమాలు, నిరసనలు, ర్యాలీలు ఇవన్నీ కొద్ది రోజులపాటు ఉధృతంగా సాగుతాయి. న్యాయం కోసం గొంతులు ఎత్తబడతాయి. కానీ ఈ స్పందన ఎక్కువ కాలం నిలవదు. కొద్ది రోజుల్లోనే మరో కొత్త ఘటన వార్తల్లోకి వస్తుంది. ప్రజల దృష్టి దానిపై మళ్ళుతుంది. పాత సంఘటనలు క్రమంగా మరుగున పడిపోతాయి. బాధితుల కోసం ప్రారంభమైన పోరాటం కూడా మధ్యలోనే ఆగిపోతుంది. ఇది కేవలం సంఘటనల మార్పు కాదు; ఇది మన సమాజపు జ్ఞాపకశక్తి, స్పందన సామర్థ్యం తగ్గిపోతున్న సంకేతం. ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. కఠినమైన చట్టాలు తీసుకువస్తున్నారు. శిక్షలను పెంచుతున్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తున్నారు. మహిళా భద్రత, మానవ హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక కమిటీలు, సంస్థలు ఏర్పడుతున్నాయి. అయినప్పటికీ, ఈ ఘటనలు పూర్తిగా తగ్గడం లేదు. ఎందుకు? ఈ ప్రశ్నకు సమాధానం కేవలం చట్టాల్లో లేదు. సమస్య అసలు మూలం మనుషుల ఆలోచనల్లో, విలువల్లో ఉంది. చట్టాలు భయాన్ని కలిగించగలవు, కానీ అవి మనసులను మార్చలేవు. ఒక వ్యక్తి తప్పు చేయకూడదని నిర్ణయించుకోవడం చట్టం వల్ల కాదు; అది అతని విలువల వల్ల, అతని పెంపకం వల్ల, అతని మనసులో ఉన్న మానవత్వం వల్ల. ఇప్పటి సమాజంలో వేగంగా మారుతున్న జీవనశైలి, డిజిటల్ ప్రభావం, అసమతుల్యమైన సమాచార వినియోగం, అశ్లీలతకు సులభంగా లభ్యమవుతున్న ప్రాప్యత ఇవన్నీ కూడా మనుషుల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయి. సంబంధాల పట్ల గౌరవం తగ్గిపోవడం, వ్యక్తిని ఒక వస్తువుగా చూడడం, మహిళలను లేదా పురుషులను తక్కువగా అంచనా వేయడం వంటి ధోరణులు పెరుగుతున్నాయి. ఇది ఒక సాంస్కృతిక సమస్యగా మారుతోంది. ఇక్కడ కుటుంబ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుంది. పిల్లలకు చిన్నప్పటి నుంచే గౌరవం, సమానత్వం, పరస్పర అవగాహన వంటి విలువలను నేర్పించాలి. స్త్రీ అంటే గౌరవం, పురుషుడు అంటే బాధ్యత అనే భావనలు మాటల్లో మాత్రమే కాకుండా, ప్రవర్తనలో కూడా ప్రతిబింబించాలి. అదే విధంగా విద్యాసంస్థలు కూడా కేవలం పాఠ్యాంశాలపై కాకుండా, నైతిక విలువలు, భావోద్వేగ బుద్ధి , లింగ సున్నితత్వం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. మీడియా పాత్ర కూడా అత్యంత ముఖ్యమైనది. కేవలం సంచలనాత్మకంగా వార్తలను చూపించడం కాకుండా, సమస్యల మూలాలను విశ్లేషించి, సమాజంలో చైతన్యం కలిగించే విధంగా వ్యవహరించాలి. ప్రతి ఘటనను టి ఆర్ పి కోణంలో కాకుండా, బాధితుల గౌరవాన్ని కాపాడే విధంగా, పరిష్కార దిశగా ప్రజలను ఆలోచింపజేసే విధంగా ప్రసారం చేయాలి. ఇక సమాజం మొత్తం కూడా తన బాధ్యతను గుర్తించాలి. ఒక సంఘటన జరిగినప్పుడు మాత్రమే స్పందించడం సరిపోదు. అలాంటి సంఘటనలు జరగకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాల్లో అనుమానాస్పద పరిస్థితులు గమనించినప్పుడు స్పందించాలి. బాధితులకు మద్దతు ఇవ్వాలి. న్యాయం కోసం నిలబడాలి. చివరగా, ఒక ముఖ్యమైన విషయం మార్పు ఎప్పుడూ బయట నుంచి రాదు. అది ప్రతి వ్యక్తిలోనూ ప్రారంభమవుతుంది. మన ఆలోచనల్లో, మన మాటల్లో, మన ప్రవర్తనలో మార్పు వచ్చినప్పుడు మాత్రమే సమాజంలో నిజమైన మార్పు కనిపిస్తుంది. మానవత్వం మళ్లీ బలపడాలి. పరస్పర గౌరవం పెరగాలి. అప్పుడు మాత్రమే ఈ సంఘటనల వరద ఆగుతుంది. ఘటనలు రావడం ఆగకపోవచ్చు. కానీ మన స్పందన మారాలి. మన దృక్పథం మారాలి. అదే నిజమైన పరివర్తనకు మార్గం.



సోరుపాక అనిల్ కుమార్
కాకతీయ విశ్వవిద్యాలయం

# హనుమకొండ జిల్లా కాంగ్రెస్ మెడికల్ వింగ్ చైర్మన్‌గా డా. శ్రవణ్ కుమార్ బాధ్యతలు

**ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో భేటీ**

**హన్మకొండ, ఏప్రిల్ 03 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో డాక్టర్స్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్ హనుమకొండ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ పి. శ్రవణ్ కుమార్ నియమితులయ్యారు. రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎం. రాజీవ్ జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల మేరకు ఆయన ఈ బాధ్యతలను స్వీకరించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలకు వైద్య విభాగం ద్వారా మరింత బలోపేతం కల్పించే దిశగా ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నివాసంలో డాక్టర్ పి. శ్రవణ్ కుమార్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో పార్టీ అభివృద్ధి, మెడికల్ వింగ్ భవిష్యత్ కార్యాచరణ, జిల్లాలో ప్రజలకు అందించాల్సిన వైద్య సేవలపై విస్తృతంగా చర్చించారు. తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించినందుకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి డాక్టర్ శ్రవణ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, వైద్య రంగంలో తన అనుభవాన్ని వినియోగిస్తూ పార్టీ కార్యకర్తలకు, సాధారణ ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో మెడికల్ క్యాంపులు నిర్వహించడం, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలతో మరింత దగ్గరగా ఉండేలా వైద్య సేవలను విస్తరించడం ద్వారా కాంగ్రెస్ పార్టీకి మరింత ప్రజాదరణ తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీకి నిబద్ధతతో పనిచేసే యువ డాక్టర్లను ప్రోత్సహించడం ద్వారా సంస్థాగతంగా పార్టీ మరింత బలపడుతుందని తెలిపారు. డాక్టర్ శ్రవణ్ కుమార్ తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించి జిల్లాలో పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, వైద్యులు, కార్యకర్తలు పాల్గొని డాక్టర్ శ్రవణ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



# హుజూరాబాద్ డంప్ యార్డ్ వివాదం ముదురుతోంది

**ప్రభుత్వ సలహాదారును మరోసారి కలిసిన ప్రణవ్, ప్రాజెక్ట్ వెనక్కి తీసుకోవాలంటూ వినతి**

**హుజూరాబాద్, 03 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

హుజూరాబాద్ పట్టణ పరిధిలోని సిర్సపల్లి శివారులో ప్రతిపాదించిన డంప్ యార్డ్ (వేస్ట్ టు ఎనర్జీ యార్డ్) నిర్మాణం చుట్టూ వివాదం రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో, హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మరోసారి ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యుడు వేమ నరేందర్ రెడ్డిని కలిసి ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ప్రణవ్ మాట్లాడుతూ, సిర్సపల్లి ప్రాంతం వ్యవసాయానికి కీలక కేంద్రంగా ఉందని, అక్కడ డంప్ యార్డ్ ఏర్పాటు చేయడం వల్ల పంటల ఉత్పాదకత దెబ్బతింటుందని స్పష్టంచేశారు. వ్యర్థాల నుంచి ఉద్భవించే కాలుష్యం భూగర్భ జలాలను కలుషితం చేసే ప్రమాదం ఉందని, దాని ప్రభావం దీర్ఘకాలికంగా రైతులు, స్థానిక ప్రజల జీవన విధానంపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే కాకుండా, వ్యర్థాల నిర్వహణ కేంద్రం వల్ల వచ్చే దుర్వాసనలు, గాలి కాలుష్యం, కీటక సమస్యలు ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా జనావాసాల మధ్యలో ఈ ప్రాజెక్ట్‌ను అమలు చేయడం ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో డంప్ యార్డ్‌ను హుజూరాబాద్ నుంచి పూర్తిగా వెనక్కి తీసుకోవాలని, లేదా ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగని వేరే అనుకూల ప్రదేశానికి తరలించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల మనోభావాలను గౌరవించి, నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఈ అంశంపై వారంలో రెండోసారి నరేందర్ రెడ్డిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌పై ముందుకు వెళ్లకుండా తక్షణమే ఆపాలని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ప్రణవ్ విజ్ఞప్తి చేశారు. ప్రణవ్ వినతిపై స్పందించిన నరేందర్ రెడ్డి, ఈ విషయాన్ని సానుకూలంగా పరిశీలిస్తామని, సంబంధిత అధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే స్థానికంగా ప్రజలు, రైతులు డంప్ యార్డ్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో, ఈ అంశం రాజకీయంగా కూడా ప్రాధాన్యత పొందుతోంది. ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఏ విధమైన నిర్ణయం తీసుకుంటుందో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# దొడ్డి కొమరయ్య ఆశయాలు కొనసాగించాలి



**(కేయూ జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం లో బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బోడిగే సతీష్ అధ్యక్షతన దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి రామచంద్రం హాజరై మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య ఆశయాలను యువత కొనసాగించాలని తెలిపారు. జనగామ తాలూకా కడివెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో విష్ణుర్ దేశ్ముకులకు వ్యతిరేకంగా పోరాడి 19వ ఏటనే అమరుడైన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్, అకుట్ ప్రెసిడెంట్ ఆచార్య వెంకటరామిరెడ్డి కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవ రెడ్డి ఐ క్యూ ఎస్ సి సంచాలకులుఆచార్య నరసింహ చారి స్టూడెంట్ అఫైర్స్ ఆచార్య మామిడాల ఇస్తారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ,డాక్టర్ చిర్ర రాజు, యూనివర్సిటీ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ సూర్యం డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్ కేయూ పీఆర్ఓ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమకొండలో అవినీతి బహిర్గతం

**వడ్డేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక దాడులు**




**హన్మకొండ, 03 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలోని వడ్డేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల ఆకస్మిక సోదాలతో ఒక్కసారిగా కలకలం రేపింది. గత కొంతకాలంగా కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్లు, లంచాల వసూళ్లు జరుగుతున్నాయన్న పలు ఫిర్యాదులు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా ఏసీబీ అధికారులు సడెన్‌గా కార్యాలయాన్ని చుట్టుముట్టారు. సోదాలు ప్రారంభించగానే కార్యాలయ తలుపులు మూసివేసి, లోపల ఉన్న సిబ్బందిని బయటకు వెళ్లనీయకుండా కట్టుదిట్టమైన తనిఖీలు చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్-1, సబ్ రిజిస్ట్రార్-2 చాంబర్లతో పాటు ఇతర విభాగాల్లోని రికార్డులు, రిజిస్ట్రేషన్ ఫైళు్లు, నగదు లావాదేవీలకు సంబంధించిన పత్రాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా గత కొంతకాలంగా జరిగిన రిజిస్ట్రేషన్లపై ప్రత్యేక దృష్టి సారించిన అధికారులు, అనుమానాస్పద ఫైళ్లను వేరు చేసి విశ్లేషిస్తున్నట్లు సమాచారం. సోదాల సమయంలో కార్యాలయం వెలుపల కూడా అసాధారణ పరిస్థితి కనిపించింది. సుమారు 20 మంది డాక్యుమెంట్ రైటర్లు, 70కు పైగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో క్యూలో నిలబడి ఉండగా, సోదాల కారణంగా వారి పనులు నిలిచిపోయాయి. ఈ పరిణామం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇక ముఖ్యంగా గత నాలుగు నెలలుగా రిజిస్ట్రేషన్ పూర్తయిన దాదాపు 200 డాక్యుమెంట్లను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ అధికారులు ఇవ్వకుండా ఉంచుతున్నారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. "లంచం ఇవ్వకపోతే డాక్యుమెంట్లు ఇవ్వడం లేదు" అంటూ పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. నేరుగా కార్యాలయానికి వచ్చిన కొనుగోలుదారులను కూడా వివిధ కారణాలతో తిరస్కరించడం, అనవసరంగా ఆలస్యం చేయడం జరుగుతోందని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సోదాల సమయంలో కొంతమంది ఏజెంట్ల వద్ద నుంచి సుమారు రూ.45,500 నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అంతేకాకుండా కొందరు ఏజెంట్లకు సబ్ రిజిస్ట్రార్ సూచన మేరకు రూ.1 లక్ష, రూ.50 వేల రూపాయలు చెల్లించాలని పంపిన మెసేజ్‌లు కూడా అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఇవి కేసులో కీలక ఆధారాలుగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సోదాలను వరంగల్ రేంజ్ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు సమన్వయంతో నిర్వహిస్తున్నాయి. కార్యాలయంలో జరిగిన ప్రతి లావాదేవీపై దర్యాప్తు కొనసాగుతుండగా, అక్రమ వసూళ్లు జరిగాయా? నిబంధనలు ఉల్లంఘించి రిజిస్ట్రేషన్లు నిర్వహించారా? అనే కోణాల్లో అధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు. ఈ ఘటనతో వడ్డేపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు నిజమైతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని భావిస్తున్నారు. ప్రస్తుతం సోదాలు కొనసాగుతుండగా, పూర్తి వివరాలు, తదుపరి చర్యలపై ఏసీబీ అధికారులు అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఈ సంఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# గుడ్ ఫ్రైడే అంటే ప్రభువైన యేసుక్రీస్తు మానవాళి కోసం సిలువ వేయబడినాడు






### సిలువపై వేలాడదీసిన రోజు గుడ్ ఫ్రైడే

**మంగపేట ఏప్రిల్ 03 జైభీమ్ న్యూస్**

ఈరోజు మంగపేట మండలంలో కోమటిపల్లి క్రాస్ అగాపే ఓఫిర్ మినిస్ట్రీస్ పాస్టర్ దేవసహాయం బర్నబాస్ ప్రేమానందం. రాజుపేట, పునీత ప్రాన్సిస్ జేవియర్ ఏప్రిల్ 3వ తారీఖున పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే ఘనంగా జరుకోవడం జరిగింది క్రీస్తును శిలువ వేయటం కల్వరి వద్ద అతని మరణం యొక్క జ్ఞాపకాలను గుర్తు చేసుకునే పండుగ క్రీస్తు సువార్తల ఆధారంగా క్రీస్తును శిలువ వేయటం దాదాపు శుక్రవారంమే జరిగింది క్రైస్తవులు విశ్వాసం ప్రకారము యేసుక్రీస్తు శుక్రవారం సిలువ వేయబడ్డాడు యేసు క్రీస్తు మరణిస్తే శుభశుక్రవారం లేదా గుడ్ ఫ్రైడే ఎందుకు పిలుస్తున్నాము? అసలు ఈ రోజు శుభం ఎలా అవుతుంది.? మానవాళి పాపాల కోసం సిలువపై ప్రాణాలు అర్పించిన జీసస్ గుడ్ ఫ్రైడే శుభ శుక్రవారం చాలా చాలామంది తెలియని వారు గుడ్ ఫ్రైడే అంటే గుడ్ ఫ్రైడే అంటే క్రైస్తవులు ప్రకారం మానవాళి చేసిన పాపాల కోసం తన ప్రాణాలను జీసస్ శిలువపై ప్రాణంగా పెట్టాడని చెబుతారు ప్రభువైన యేసు సిలువపై వేలాడదీసిన రోజును పవిత్ర శుక్రవారం లేదా బ్లాక్ ఫ్రైడే అని కూడా పిలుస్తారు యేసుప్రభువు చనిపోయిన రోజును గుడ్ ఫ్రైడే అని పిలుస్తారు ఈ రోజున క్రైస్తవులు ఉపవాసం ఉండి దేవుడ్ని తలుచుకుంటూ ప్రార్ధనలో గడుపుతారు ప్రభువైన యేసుని సిలువ వేయబడినప్పుడు మాట్లాడిన ఏడు మాటలు, తండ్రి వీరేమి చేయుచున్నారో వీరేరుగరు గనుక వీరిని క్షమించుము, నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను, అమ్మ ఇదిగో నీ కుమారుడు ఇదిగో నీ తల్లి, నా దేవా నా దేవా నన్ను ఎందుకు చెయ్యి విడిచితివి, నేను దప్పిగోనుచున్నాను, సమాప్తమైనది, తండ్రి నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను అని సిలువలో వేలాడుచున్నటువంటి ప్రభువైన యేసు మాట్లాడిన ఏడు మాటలు. గుడ్ ఫ్రైడే క్రైస్తవులకు పవిత్రమైన రోజు ఎందుకంటే యేసుక్రీస్తు సిలువ వేయబడిన రోజు కనుక క్రైస్తవులకు కీలకమైన పండగ రోజు యేసు క్రీస్తు తన ప్రాణాన్ని బలి ఇవ్వడం ద్వారా మానవాళి రక్షణకు మార్గం క్రీస్తు పాట్ల శ్రమల చరిత్రను సజీవ సిలువ మార్గం ద్వారా రూపొందించారు. క్రైస్తవ సంఘం నిజమైన దేవుడు క్రీస్తు ప్రభువు అని, విశ్వసించిన ప్రతి ఒక్కరు నిత్యజీవం పొందుతారని వారి పాపముల నుంచి రక్షించబడతారని అదే విధంగా తిరిగి పరలోక రాజ్యంలో చేరటానికి ప్రభువే స్వయంగా ప్రజల యొక్క పాపములను అతని మీద వేసుకొని సిలువ మరణం ద్వారా వారికి నిత్య జీవితాన్ని ప్రసాదించారని వారి యొక్క విశ్వాసాన్ని ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమం ఫాదర్ చరణ్ ఆధ్వర్యంలో ఆర్ఎంసి సిస్టర్స్ రాజపేట సంఘ పెద్దలు కాటూర్, మల్లారం విశ్వాసులు యువతి యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చూపించాడని క్రైస్తవులు నమ్ముతారు గుడ్ ఫ్రైడే అధ్యాయాన్ని స్మరించుకునే రోజు యేసుక్రీస్తు సిలువ వేయబడ్డారు అని స్మరించుకుంటూ క్రైస్తవులు ఆ రోజు ప్రార్ధనలు ధ్యానంతో గడుపుతారు

# క్రీస్తు త్యాగానికి ప్రతీకగా గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహణ





**వై.ఎస్.ఆర్. కడప, ఏప్రిల్ 3 (జై భీమ్ న్యూస్) :**

కడప శివారులోని పాస్టల్ సెంటర్‌లో గుడ్ ఫ్రైడే వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప బిషప్ డా. సగినాల పాల్ ప్రకాష్, ఫాదర్ వరప్రసాద్, డైరెక్టర్ రెవ. ఫాదర్ వరప్రసాద్, నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్ డా. మద్దెల సురేష్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామాంజనేయపురం వై.ఎస్.ఆర్ సర్కిల్ నుండి ప్రారంభమైన పాదయాత్రలో సుమారు 200 మంది భక్తులు పాల్గొన్నారు. సిలువ యాత్ర పాస్టల్ సెంటర్ వరకు భక్తిపూర్వకంగా కొనసాగింది. బిషప్ డా. సగినాల పాల్ ప్రకాష్ మాట్లాడుతూ, గుడ్ ఫ్రైడే అనేది యేసుక్రీస్తు మానవాళి రక్షణ కోసం తన ప్రాణాలను అర్పించిన పవిత్ర దినమని తెలిపారు. సిలువపై మరణించే ముందు యేసు పలికిన ఏడు చివరి మాటల ప్రాముఖ్యతను వివరించారు: 1.తండ్రి, వీరు ఏమి చేయుచున్నారో వీరేరుగరు. 2.నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువి. 3.అమ్మా, ఇదిగో నీ కుమారుడు; ఇదిగో నీ తల్లి. 4.నా దేవా, నా దేవా, నన్ను ఎందుకు విడిచితివి? 5.నేను దప్పికగొనుచున్నాను. 6.సమాప్తమైనది. 7.తండ్రి, నీ చేతికి నా ఆత్మను అప్పగించుకొనుచున్నాను. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసు క్రీస్తు మానవాళి పాప విమోచనార్థం తన ప్రాణత్యాగం చేశాడని విశ్వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్రిస్టఫర్, బాలస్వామి, సిస్టర్ రోశ్రాని, సిస్టర్ శౌరీలు, మద్దెల రాజేశ్వరి, కుమారి, డా. సత్యం, సుధాకర్, కస్పర్, తవ్వ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# మాదిగ ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి నాయకులకు మరియు మేధావి వర్గానికి స్వాగతం సుస్వాగతం




**(హైదరాబాద్ జై భీమ్ న్యూస్)**

ఏప్రిల్ 5, 2026 ఆదివారం నాడు ఉదయం 10 గంటలకు గౌరవ నీయులు మాజీ మంత్రివర్యులు మాదిగలకు రాజకీయ రంగాలలో పాటు అన్ని రంగాలలో మాదిగలవాటా మాదిగలకు దక్కాలంటే మాదిగల ఓటు మాదిగకే వేసుకోవాలి అనే నినాదంతో, ఒక దృఢమైన సంకల్పంతో, మాదిగ జాతికిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని ఒక ఆశయంతో స్థాపించిన మాదిగ మహా శక్తి యొక్క జెండా ఆవిష్కరణ జరుగుతుంది, మానవతావాది, సమైక్యవాది బాబు జగ్జీవన్ రామ్ గారి జయంతి నాడు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఉదయం 10 గంటలకు జెండా ఆవిష్కరణను శ్రీ మోత్కుపల్లి నర్సింహులు తన చేతుల మీదుగా చేయుచున్నారు. ఈ సందర్భంగా మన మాదిగ జాతి మేధావులు, ఉద్యోగ ఉపాధ్యాయ విద్యార్థిని ద్యార్థులు జగ్జీవన్ రామ్ జయంతి తో పాటు, ఇట్టి జెండా కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఏప్రిల్ 5 నాడు ఉదయం 10 గంటలకు రావలసిందిగా కోరుతున్నాం. (ఎం ఎం ఎస్) కార్య నిర్వాహక కమిటీ, 9391681304, 9949119609, 9618557547.

# అంబెడ్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

ఏటూరునాగారం అంబెడ్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు



**ఏటూరునాగారం ఏప్రిల్ 03: జై భీమ్ న్యూస్**

ఏటూరునాగారం సబ్ డివిజన్ కేంద్రంలోని ఏఎస్పీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ మహాసభ వాలీబాల్ క్రీడల వాల్పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది అంబేద్కర్ ఉత్సవకమిటీ కార్యనిర్వహణ అధ్యక్షులు చిలువేరు అన్నమయ్య ఆధ్వర్యంలో ఏఎస్పి మాట్లాడుతు యువకులు క్రీడాలలో ముందుండాలి మద్యానికి బానిసలూ కావద్దు అంబెద్కర్ ఉత్సవ కమిటీ మంచి ఆలోచనతో పెట్టడం చాలా ఆనందం యువకులను ప్రోత్సహాయించి ఎక్కువ జట్లు వచ్చే విదంగా చూడండి అని మాట్లాడడం జరిగిందిఇట్టి కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు వావిలాల ఎల్లయ్య అంబెద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులకు పరికి శ్రీనివాస్, ఎంపెల్లి శేంకర్, పరికి వేణు, దేపాక సతీష్ తదితరులు పాలుగోన్నారు.

# పోలీస్ డ్యూటీ మీట్‌లో రాణించిన పోలీస్ పి.ఆర్.ఓ మోహన కృష్ణ

**(వరంగల్ జై భీమ్ న్యూస్)**





69వ జాతీయ పోలీస్ డ్యూటీ మీట్ లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పి. ఆర్. ఓ మన్నవ మోహన కృష్ణ రాణించాడు. మహారాష్ట్రలోని నాగ్ పూర్ నగరంలో మార్చ్ 29 నుండి ప్రారంభమైన జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో పి. ఆర్. ఓ గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ మోహన కృష్ణ ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ టీం విభాగంలో రాణించడంతో ఈ పోటీల్లో తెలంగాణ పోలీస్ ఫోటో గ్రాఫర్స్ టీం రెండవ స్థానంలో నిలిచి రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఈ పోటీలకు సంబంధించి శుక్రవారం రాత్రి నాగ్ పూర్ పోలీస్ శిక్షణ కేంద్రంలో జరిగిన ముగింపు వేడుకల్లో కేంద్ర హోం శాఖ సహాయ శాఖ మంత్రి నిత్యానంద రాయ్ చేతుల మీదుగా మోహన కృష్ణ, కోచ్ జయరాజ్, కానిస్టేబుల్ రాజశేఖర్ తో కలసి ప్రొఫెషనల్ ఫోటోగ్రఫీ రన్నరప్ ట్రోఫీని అందుకున్నారు. ఈ సందర్భంగా ఈ పోటీల్లో రాణించిన మోహన కృష్ణ ను వరంగల్ పోలీస్ కమిషనర్ తో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు ఇతర పోలీస్ సిబ్బంది అభినందించారు.

# హన్మకొండ జిల్లాలో దారుణ ఘటన

**హన్మకొండ, జై భీమ్ న్యూస్)**




మళ్లీ ఆడపిల్ల పుడుతుందనే అనుమానంతో భార్య ఇద్దరు కూతుళ్లను హతమార్చిన భర్త. హన్మకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలు గ్రామ శివారులో స్విమ్మింగ్ పూల్ నిర్వహిస్తూ, భార్య ఫర్హాత్(26), కూతుళ్లు ఉమేరా (8), అయేషా(6)తో నివాసం ఉంటున్న అజారుద్దీన్ అనే వ్యక్తి. ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన అనంతరం, ఫర్హాత్ రెండు సార్లు గర్భం దాల్చగా, ఆడపిల్ల పుడుతుందనే అనుమానంతో అబార్షన్ చేయించిన అజారుద్దీన్. నాలుగేళ్ల అనంతరం మళ్లీ గర్భవతి కాగా, ఆడపిల్ల పుడుతుందనే అనుమానంతో భార్యను అబార్షన్ చేయించుకోవాలని ఒత్తిడి చేసిన భర్త. దానికి ఆమె అంగీకరించకపోవడంతో, భార్య పిల్లలను తమ స్విమ్మింగ్ పూల్ వద్దకు తీసుకెళ్లి, అందులో తోసేసి హత్యచేసి, ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నించిన అజారుద్దీన్. ఫర్హాత్ తండ్రి అజారుద్దీన్ పట్ల అనుమానం ఉందని తెలపడంతో, అతన్ని అదుపులోకి తీసుకుని విచారించి, తానే హత్య చేసినట్లు నిర్ధారించిన పోలీసులు.

# బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ కార్పొరేషన్ చైర్మన్ డా.కె.వాసుదేవ రెడ్డి

**(హైదరాబాద్ జై భీమ్ న్యూస్)**

బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాజీ కార్పొరేషన్ చైర్మన్ డా.కె.వాసుదేవ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి తిరుమల తిరుపతి ప్రసాదం అందజేసిన కాకతీయ యూనివర్సిటీ రజక విద్యార్థి సంఘం ఇన్చార్జి కోరపల్లి రాజేష్. ఇటీవల తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదాన్ని హైదరాబాదు లో మాజీ కార్పొరేషన్ చైర్మన్ డా.కె.వాసుదేవ రెడ్డి గారిని వారి నివాసంలో కలిసి ప్రసాదం అందజేసినట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోరపల్లి రాజేష్ తో రాజు, రాకేష్ తోపాటు ఇతర విద్యార్థులు నాయకులు ఉన్నారు.



# ఎల్లాపూర్‌లో ప్రభుత్వ భూముల రక్షణకు వినతి

### సీపీఐ నేతలకు గ్రామస్తుల ఫిర్యాదు



**హసన్‌పర్తి, 03 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం 65వ డివిజన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామంలో ప్రభుత్వానికి చెందిన అంగడి భూమి, చేపల కేంద్ర భూములు భూ కబ్జాదారుల చేతిలోకి వెళ్లాయని ఆరోపిస్తూ వాటిని రక్షించాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కే. నారాయణకు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, సర్వే నంబర్ 246/1లో సుమారు 12 ఎకరాలు 13 గుంటల విస్తీర్ణంలో చేపల బావి, కలగిరి బంగ్లా ఉన్న భూమిని భూ కబ్జాదారులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అదేవిధంగా, సర్వే నంబర్ 316లో సుమారు 4 ఎకరాలు 16 గుంటల గ్రామపంచాయతీ అంగడి స్థలం 1970లో అప్పటి పట్టాదారుల నుంచి చెల్లింపులు చేసి గ్రామపంచాయతీ స్వాధీనం చేసుకుని, 1973 నుంచి అంగడి నిర్వహణ కొనసాగుతోందని పేర్కొన్నారు. పహాని రికార్డుల్లో ప్రభుత్వ అంగడి భూమిగా నమోదు ఉన్నప్పటికీ, 2022లో ధరణి వ్యవస్థలోని లోపాలను ఉపయోగించుకుని కొందరు వారసులు అక్రమంగా పట్టా పొందారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ భూమిలో ప్రభుత్వ పశువైద్యశాల, పాఠశాల ఆటస్థలం వంటి ప్రజా ఉపయోగాల నిర్మాణాలు ఉన్నప్పటికీ, స్థానికులతో కలిసి కబ్జాదారులు ఆక్రమణలకు పాల్పడ్డారని తెలిపారు. రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు కబ్జాదారులకు సహకరించారని గ్రామస్తులు తీవ్రంగా విమర్శించారు. గతంలో ఎమ్మార్వో, ఆర్డీవో, కమిషనర్, కలెక్టర్, సీఎం క్యాంప్ ఆఫీస్, భూభారతి వంటి వేదికల ద్వారా పలు మార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాలకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు పంచే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ, నేదునూరి రాజమౌళి, మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, గోపు బుచ్చిరెడ్డి, రేణుకుంట్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో విషాదం

### సర్పంచ్ ఆత్మహత్యాయత్నం.. ఆసుపత్రికి తరలిస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి



**హైద్రాబాద్, 03 ఎప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేట గ్రామంలో శుక్రవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ లహరి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఆమెను ఆసుపత్రికి తరలించే క్రమంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. స్థానిక సమాచారం మేరకు, లహరి అనుమానాస్పద పరిస్థితుల్లో పురుగుల మందు సేవించడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను కారులో సమీప ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వేగంగా వెళ్తున్న కారు మార్గమధ్యంలో అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ట్రాక్టర్ నాగళ్లను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా, ఇప్పటికే విషప్రయోగంతో బాధపడుతున్న లహరి పరిస్థితి మరింత విషమించింది. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ, మార్గమధ్యలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒకే రోజు ఆత్మహత్యాయత్నం, రోడ్డు ప్రమాదం వంటి దుర్ఘటనలు చోటుచేసుకోవడంతో మాసాయిపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సర్పంచ్ లహరి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు ఏమిటి? ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు ఏవి? అనే అంశాలపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

# రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి కీలక చర్చలు



**హైద్రాబాద్, 03 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో పాడి పరిశ్రమ అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక చర్చలు జరిపారు. జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు (ఎన్.డి.డి.బి) చైర్మన్ డాక్టర్ మీనేష్ షా, మదర్ డైరీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ జయతీర్థ చారి మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పాడి రంగాన్ని బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలు, పాల ఉత్పత్తి పెంపు, రైతులకు ప్రోత్సాహకాలు, సాంకేతిక ఆధునీకరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పాడి పరిశ్రమ కీలకంగా ఉండడంతో, దానిని మరింత అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించినట్లు సమాచారం. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

# చెరువుల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యాచరణ

### మంత్రి కొండా సురేఖ శంకుస్థాపనలు



**వరంగల్, 03 ఏప్రిల్ 2026(జై భీమ్ న్యూస్)**

నగరంలోని చెరువుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అమృత్ 2.0 పథకం కింద రూ.6 కోట్ల వ్యయంతో చిన్న వడ్డేపల్లి చెరువు, ఉర్సు రంగసముద్రం చెరువుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి వెల్లడించారు. చెరువుల అభివృద్ధి ద్వారా భూగర్భ జలాల పెరుగుదల, పర్యావరణ పరిరక్షణతో పాటు నగర సౌందర్యం మెరుగుపడుతుందని ఆమె పేర్కొన్నారు. చెరువులను శుభ్రపరిచి ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఉర్సు రంగసముద్రం చెరువు అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు, దేశాయిపేట చెరువుకు కూడా నిధులు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించనున్నట్లు చెప్పారు. నగరంలోని వివిధ డివిజన్లలో అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని, ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి మేయర్, కమిషనర్, కలెక్టర్ల సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని మంత్రి వివరించారు. ముఖ్యమంత్రి 99 రోజుల కార్యాచరణలో భాగంగా 5 గ్యారంటీల అమలు జరుగుతోందని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, సీఎం బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం, రూ.5 లక్షల ఉచిత జీవిత బీమా వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. టెక్స్‌టైల్ పార్క్ నేపథ్యంలో మహిళలకు కుట్టు యంత్రాలపై శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ చెరువుల పునరుద్ధరణతో పర్యావరణ సమతుల్యత కాపాడబడటంతో పాటు ప్రజలకు శుభ్రమైన వాతావరణం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డా. సత్య శారద, చాహత్ బాజ్ పాయ్, కార్పొరేటర్లు సురేష్ జోషి, మరుపల్ల రవి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మేడారం సమ్మక్క గద్దెల వద్ద గాయపడ్డ బాలుడి యువాన్ ను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

### మేడారం కట్టడాలు 1000 ఏళ్ల నిలిచిపోయే చరిత్ర అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ బాలుడి జీవితం కోల్పోయాడు
### సిద్ధబోయిన రమేష్ కుటుంబానికి 25 లక్షల ఎక్స్ గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి



**తాడ్వాయి ఏప్రిల్ 03: జైభీమ్ న్యూస్**

తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో గత నెల 25వ తేదీన మేడారం గద్దెల వద్ద ప్రమాదానికి గురైన పూజారి సిద్దబోయిన రమేష్ కుమారుడు యువన్(6 సంవత్సరాలు సమ్మక్క గద్దె వద్ద ఆడుకుంటున్న సమయంలో గద్దె కు ఉన్న సైడ్ బండలు ఊడి ప్రమాదం జరిగినది వైద్య నిమిత్తం హాస్పటల్ తరలించగా బాలుడు యువన్ కాలు పూర్తిగా నుజ్జు నుజ్జు కావడంతో కాలు తొలగించిన వైద్యులు మరొక కాలు కూడా ఫ్యాక్చర్ కావడం జరిగినది బాలుడు యువాన్ పరిస్థితి చాలా బాధాకరంగా ఉందని లక్ష్మణ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు మేడారం ప్రమాదంలో గాయపడ్డ బాలుడి కుటుంబానికి 25 లక్షల రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని ఈ సందర్భంగా ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకుల మర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు గతంలోనే ఎన్నోసార్లు బిఆర్ఎస్ పార్టీ పక్షాన అనేకసార్లు నాణ్యత లోపిస్తుందని చెప్పినప్పటికీ ప్రభుత్వం కాంట్రాక్టర్లు మంత్రులు పెడచెవిన పెట్టి కాసులు కక్కుర్తి కోసం నిరుపేద అయినా సమ్మక్క పూజారి సిద్ధబొయిన రమేష్ కొడుకు యావన్ ఒక కాలు పూర్తిగా తీసివేయగా మరొక కాలు అంగవైకల్యంలోనే ఉండడం చాలా బాధాకరమని దీనికి ప్రభుత్వం మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులు సీతక్క గారు కళ్ళు తెరిచి మేడారంలో జరిగిన సంఘటనపై విచారణ జరిపించి సంబంధిత అధికారులు కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలని మరియు ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా ఉండేందుకు మేడారం అభివృద్ధి పనులను సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించి బాధ్యులపై చర్య తీసుకొని రాబోయే రోజుల్లో ప్రమాదాలు జరగకుండా చూడాలని ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏటురునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలత బిఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావు ఎండి వాలి బాబా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమరయ్య ఆశయాలు కొనసాగించాలి



**కాకతీయ యూనివర్సిటీ / జై భీమ్ న్యూస్**

కె యు పరిపాలన భవనం లో బీసీ సెల్ సంచాలకులు డాక్టర్ బోడిగే సతీష్ అధ్యక్షతన దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి రామచంద్రం హాజరై మాట్లాడుతూ దొడ్డి కొమురయ్య ఆశయాలను యువత కొనసాగించాలని తెలిపారు. జనగామ తాలూకా కడివెండి గ్రామానికి చెందిన దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ పోరాటంలో విష్ణుర్ దేశ్ముకులకు వ్యతిరేకంగా పోరాడి 19వ ఏటనే అమరుడైన తెలిపారు. ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్, అకుట్ ప్రెసిడెంట్ ఆచార్య వెంకటరామిరెడ్డి కేయూ అభివృద్ధి అధికారి ఆచార్య వాసుదేవ రెడ్డి ఐ క్యూ ఎస్ సి సంచాలకులుఆచార్య నరసింహ చారి స్టూడెంట్ అఫైర్స్ ఆచార్య మామిడాల ఇస్తారి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ,డాక్టర్ చిర్ర రాజు, యూనివర్సిటీ విద్యా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ సూర్యం డాక్టర్ ఎర్రబొజ్జు రమేష్ కేయూ పీఆర్ఓ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# మేడారంలో 100 పడకల హాస్పిటల్ ఏర్పాటు చేయాలి

### టీడీపీ ములుగు నియోజకవర్గం ఇంచార్జి దారావత్ దేవా నాయక్ డిమాండ్



**తాడ్వాయి ఏప్రిల్ 03: జైభీమ్ న్యూస్**

మేడారం ప్రాంతం లో వంద పడకల హాస్పిటల్ ఏర్పాటు చేయాలి అని టీడీపీ ములుగు నియోజకవర్గం ఇంచార్జ్ దారావత్ దేవా నాయక్ ప్రభుత్వం ని డిమాండ్ చేశారు మేడారం జాతర కు వందల కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నారు కానీ అభివృద్ధి లేదు మొత్తం అవినీతి జరుగుతుంది అని ప్రజలకు శాశ్వతం గా ఉండే విదంగా ప్రభుత్వం ద్రుష్టి పెట్టాలి అని మేడారం ప్రాంతం లో హాస్పిటల్ ఏర్పాటు చేస్తే మేడారం చుట్టు ప్రక్కల ఉన్న మండలంలలోని గ్రామాలలో ఉన్న ప్రజలకు ఉపయోగపడుతుంది అని ప్రభుత్వం ఇప్పటికి అయినా ద్రుష్టి పెట్టి మేడారం ప్రాంతం లో 100 పడకల హాస్పిటల్ మంజూరు చేయాలి అని కోరారు సరైన నాయకుడు లేకపోతే ఇలానే ఉంటది అని విద్యా వైద్యం మీద నాయకులకు చిన్నచూపు అని వంద పడకల హాస్పిటల్ కోసం ముందు ముందు పోరాటం చేస్తాం అని తెలిపారు

# కర్ణవేదన కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్



**వెంకటాపురం ఏప్రిల్ 03జైభీమ్ న్యూస్**

ఈ రోజు వెంకటాపూర్ మండలం లోని నర్సింగపూర్ గ్రామానికి చెందిన చిన్ననాటి స్నేహితుడు కన్నెబోయిన సురేష్ కూతురి కర్ణవేదన కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించిన లక్ష్మీదేవిపేట గ్రామ సర్పంచ్ బొమ్మకంటి వంశావతి రమేష్ అదే విధంగా నర్సింగపూర్ గ్రామ సర్పంచ్ కుమార్ ఉప సర్పంచ్ గొర్రె ఓదేలు,నారిశెట్టి రమేష్,అల్లం తిరుపతి తదితరులు ఉన్నారు.

# దళిత నాయకుడు అన్నయ్య కుమారుడిపై దాడి

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

కన్నడ, దళిత నాయకుడి కుమారుడిపై జరిగిన ఘోరమైన దాడిని ఖండిస్తూ, రౌడీషీటర్ అభి అలియాస్ చిక్కా అభి, అతని అన్న చంద్రశేఖర్ దొడ్డ అభి అరెస్ట్ చేయాలని మహాదేవపుర నియోజకవర్గ కడుగుడి పోలీస్ స్టేషన్ ముందు నిరసన చేపట్టారు. ఈ ఘటన ఏప్రిల్ 1న నగరంలోని కడుగుడి పోలీస్ స్టేషన్ పరిధిలోని చన్నసంద్రలో, కడుగుడి రోడ్డుపై జరిగింది. కన్నడ దళిత నాయకుడు అన్నయ్య కుమారుడు మంజునాథ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ, దాడి చేసిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఒక రౌడీషీటర్ తన అన్నతో కలిసి దళిత నాయకుడు అన్నయ్య కుమారుడు మంజునాథ్‌పై ఘోరంగా దాడి చేశాడు. దాడి చేసిన తర్వాత కర్ణాటక లో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం మమ్మల్ని ఏమీ చేయలేదని వారు హెచ్చరించారు. నిందితులు అభి, చంద్రశేఖర్ మరియు దాడికి గురైన మంజునాథ్ స్థానిక అంబేద్కర్ నగర్ ప్రాంతానికి చెందినవారు. వారు, "స్థలం గురించి మాట్లాడుకుందాం, టీ తాగుదాం" అని చెప్పి, బీర్ బాటిల్‌తో అతని నుదుటిపై, ముఖంపై, ఛాతీపై చేతులపై దాడి చేశారు. దాడి తీవ్రత కారణంగా మంజునాథ్ నుదుటిపై ఆరు కుట్లు పడ్డాయని, అతను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని అన్నయ్య తెలిపారు. అతని సోదరి కథను ఈ విధంగా ముగిస్తామని చెబుతూ, అతన్ని చంపేస్తామని బెదిరించి, మంజునాథ్ కొత్త బైక్‌ను ధ్వంసం చేశారు. వారు రౌడీషీటర్ అభిని పోలీస్ స్టేషన్ పరిధి నుండి బహిష్కరించి, వివిధ పోలీస్ స్టేషన్లలో నిందితులు అభి, చంద్రశేఖర్‌లపై అనేక కేసులు ఉన్నాయని ఫిర్యాదు చేస్తూ చంద్రశేఖర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం, దళిత, కన్నడ, మహిళా అనుకూల సంఘాలు రౌడీషీటర్ అభి అలియాస్ చిక్కా అభి, అతని అన్న చంద్రశేఖర్ దొడ్డ అభి ని ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని మరియు రౌడీ షీటర్ ని బహిష్కరించాలని కడుగోడి పోలీసులను డిమాండ్ చేశారు.



పోలీసుస్టేషన్ ముందు దళిత నాయకులు



రౌడీషీటర్

## నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర మంత్రి కొండా సురేఖ





**వరంగల్ / జై భీమ్ న్యూస్ :**

వరంగల్, హనుమకొండ జిల్లాలోని గీసుగొండలోని ఓంకార్ గార్డెన్, ఎస్ ఆర్ ఆర్ తోట కరీంబాద్, హంటర్ రోడ్ డి కన్వెన్షన్ హాల్ లో జరిగిన పలు వివాహ వేడుకల్లో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ పాల్గొన్నారు. నూతన దంపతులను నిండు మనసుతో ఆశీర్వదించి, వారికి నూతన వస్త్రాలను బహూకరించారు. అతిథిగా వచ్చిన మంత్రి సురేఖకు ఆహ్వానితులు ఘనస్వాగతం పలికారు. కష్టసుఖాల్లో తమ వెంట నడిచే సురేఖమ్మ సదా తమ గుండెల్లో వుంటుందని వారు భావోద్వేగానికి లోనయ్యారు. తన పై ఎంతో అభిమానం, ఆప్యాయత, అనురాగాలను ప్రదర్శిస్తూ, తన వెంట నడిచే వ్యక్తులు దొరకడం తన పూర్వజన్మ సుకృతమని మంత్రి సురేఖ అభిప్రాయపడ్డారు.

## రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఆర్. కృష్ణయ్య హెచ్చరిక

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**



తెలంగాణలో ఫీజు రీయింబర్సుమెంట్ సమస్యను పరిష్కరించకపోతే మంత్రులు, ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టిస్తామని రాజ్యసభ సభ్యుడు ఆర్. కష్ణయ్య హెచ్చరించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కలు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకోకూడదనే దురుద్దేశంతో ఫీజు రీయింబర్సుమెంట్ బకాయిలు చెల్లించడం లేదని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించకుంటే మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు బయట తిరగలేరని హెచ్చరించారు. అందరూ రాష్ట్ర ఖజానాను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఫీజు రీయింబర్సుమెంట్స్‌పై వందలసార్లు ధర్నాలు, పోరాటాలు చేశామని అన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థులకు న్యాయం జరగాలని ఫీజురీయింబర్సుమెంట్స్ పథకం తీసుకువచ్చారని గుర్తు చేశారు.

## బీఆర్ఎస్ క్లోజ్... ఆ పార్టీ రోడ్డున పడింది: పీసీసీ మహేశ్ గౌడ్

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**




తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కోల్పోయిందని, బీజేపీకి ఇక్కడ స్థానం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు కాంగ్రెస్‌నే నమ్ముతున్నారని, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని మహేశ్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత సొంతంగా వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందని చెప్పారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, దీనివల్ల అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అందుకే ఆ పార్టీని ప్రజలు దూరం పెడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. "ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో మాకు 100 సీట్లు రావడం ఖాయం" అని ఆయన జోస్యం చెప్పారు.

## ఫీజు బకాయిలపై హైకోర్టు తీర్పు సరికాదు పేద విద్యార్థులు చదువులకు తీవ్ర నష్టం

**ప్రభుత్వ హామీలతో కళాశాలలో విద్యార్థులను చేర్చుకున్నారు**
**ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు**
**ఏ ఐ ఎఫ్ డి ఏస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గడ్డం నాగార్జున**

**(కేయూ జై భీమ్ న్యూస్)**



అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏ ఐ ఎఫ్ డి ఏస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున పత్రిక ప్రకటన విడుదల చేయడం జరిగింది ఈ సందర్భంగా గడ్డం నాగార్జు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఫీజు బకాలపై ఇచ్చిన తీర్పులో విద్యార్థుల నుండి వసూలు చేసుకుని ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తిరిగి విద్యార్థులకు చెల్లించాలని తీర్పు సరైనది కాదని ఇది విద్యార్థుల చదువుల అభివృద్ధికి గొడ్డలిపెట్టాని హైకోర్టు తీర్పును పున:సమిక్ష చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య(ఏ ఐ ఎఫ్ డి ఏస్) తెలంగాణ రాష్ట్ర కమిటీ కోరుతున్నది ప్రైవేటు కళాశాలలు ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారని అలాంటిది ప్రైవేటు యజమాన్యాల బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వకుండా విద్యార్థుల నుండి వసూలు చేసుకోండి అనే తీర్పు సరైనది కాదు అ అణగారిన వర్గాల నుండి ఇప్పుడే ఉన్నత విద్యలోకి వస్తున్న ప్రధానంగా ఈ ఫీజులు పొందే వారు పేద విద్యార్థులు వారిలో రాష్ట్రంలో 14 లక్షల మంది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులే ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారని వారు ఈ తీర్పు వలన మరింత ఇబ్బందులకు గురి అవుతారని ఇప్పటికే రాష్ట్రంలో ప్రైవేటు యజమాన్యాలు ఫీజు బకాయిలు రావడంలేదని పేద విద్యార్థుల సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని దీనివల్ల గతంలో విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని వారు అన్నారు ప్రభుత్వం తక్షణమే రాష్ట్రంలో పెండింగ్ లొ ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్నిఏ ఐ ఎఫ్ డి ఏస్ డిమాండ్ చేస్తుంది. హైకోర్టు తీర్పును పున: సమీక్షించి ప్రభుత్వానికి తక్షణమే ఫీజు విడుదల కోసం ఆదేశాలు ఇవ్వాలని కోరుతుంది.

## వెంకట్రావుపల్లెలో వేడుకగా లాస్య పటేల్ నూతన వస్త్ర పుష్పాలంకరణ

**చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**
**ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు**




**ఏప్రిల్ 03 జైభీమ్ ప్రతినిధి:(వరంగల్ /వర్ధన్నపేట)**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం వెంకట్రావుపల్లె గ్రామంలో కుల్ల లాస్య పటేల్ నూతన వస్త్ర పుష్పాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కుల్ల పావని - యకాంతం దంపతుల కుమార్తె లాస్య పటేల్‌కు నిర్వహించిన ఈ వేడుకకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ చిన్నారులు కుటుంబాల ఆనందానికి ప్రతీకలని, ఇలాంటి సాంప్రదాయ కార్యక్రమాలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. చిన్నారి లాస్య పటేల్ భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమం గ్రామంలో ఆనందోత్సాహాల మధ్య సాగింది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారికి ఆశీస్సులు అందజేశారు. ఈ వేడుకలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూమి ఆక్రమణ పై స్పందించని అధికారులపై ప్రజల ఆగ్రహం

**రాజరాజేశ్వర స్వామి ఆలయ భూములకి రక్షణ కరువు**
**ముసురుతున్న పలు అనుమానాలు.**



**ఏప్రిల్ 03 జైభీమ్ ప్రతినిధి:(వరంగల్ /వర్ధన్నపేట)**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ప్రాచీన కాలం నుంచి ప్రసిద్ధి చెందిన రాజరాజేశ్వర స్వామి ఆలయ భూముల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్లలో ఉన్న సుమారు 24 గుంటల భూమి అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిందనే ఆరోపణలు గ్రామస్థుల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఈ విషయమై గత నెలలోనే పలు పత్రికల్లో కథనాలు వెలువడినప్పటికీ, సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. గ్రామస్థుల వివరాల ప్రకారం, సర్వే నంబర్1439 లో 18 గుంటలు, 1440లో 6 గుంటలు మొత్తం 24 గుంటల ఆలయ భూమి ఉండగా, ప్రస్తుతం ఆ భూమి పై పలు వ్యక్తులు అనధికారంగా ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆలయ కార్యనిర్వహణ అధికారి, దేవాదాయ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఇప్పటివరకు స్థిరమైన చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తిస్తోంది. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం, ఆలయాలకు చెందిన భూములు దేవుడి మాన్యంగా పరిగణించబడతాయి. ఈ భూములను ఎవరైనా అక్రమంగా ఆక్రమించినట్లయితే, సంబంధిత ఎండోమెంట్స్ అధికారులు భూ సర్వే నిర్వహించి, పహాణి రికార్డులు పరిశీలించి, ఆక్రమణదారులపై నోటీసులు జారీ చేయాలి. అవసరమైతే రెవెన్యూ శాఖ సహకారంతో భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలి. ఇందుకు ప్రత్యేక చట్టబద్ధ అధికారాలు కూడా దేవాదాయ శాఖకు కల్పించబడ్డాయి. సాధారణంగా ఇటువంటి ఫిర్యాదులు అందిన వెంటనే ప్రాథమిక విచారణ చేపట్టి, 15 నుండి 30 రోజుల లోపు నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఆ తరువాత పరిస్థితిని బట్టి తక్షణ చర్యలు ప్రారంభించాలి. కానీ ఇల్లంద గ్రామంలో మాత్రం ఈ ప్రక్రియ ముందుకు సాగడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మౌనం వెనుక ఏదైనా ఆంతర్యం ఉందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ పెద్దలు, భక్తులు ఇప్పటికైనా దేవాదాయ శాఖ మేల్కొని సమగ్ర భూ సర్వే నిర్వహించాలని, ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలయ భూములను రక్షించడం కేవలం ఆస్తి పరిరక్షణ మాత్రమే కాదు, భక్తుల విశ్వాసాన్ని కాపాడే బాధ్యత కూడా అని వారు స్పష్టం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి, నిజానిజాలు వెలికితీసి, ఆలయ భూమిని దేవుని మాన్యంలోకి తిరిగి చేర్చుతారా? లేక ఇదే పరిస్థితి కొనసాగుతుందా? అన్నది చూడాల్సి ఉంది. ప్రస్తుతం ఇల్లందలో ఈ అంశం తీవ్ర చర్చకు దారి తీస్తోంది.

## కేరళలో రేవంత్ రెడ్డి ప్రచారం

**విమర్శలు గుప్పించిన కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఆరు గ్యారెంటీల విషయంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారం సందర్భంగా గొప్పలు పలికారని, మున్ముందు తెలంగాణలోనూ ఇదే తరహా మాటలు చెప్పే ప్రమాదం ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇటీవల రేవంత్ రెడ్డి కేరళ ఎన్నికల ప్రచారంలో పాల్గొని, బీజేపీపై విమర్శలు గుప్పించారు. అదే సమయంలో తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో కిషన్ రెడ్డి స్పందిస్తూ, కేరళ ఎన్నికల ప్రచారంలో బీజేపీపై ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. కానీ రెండున్నరేళ్లు కావొస్తున్నా ఎన్ని హామీలు నెరవేర్చిందో చెప్పాలని నిలదీశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏం చేశారని రేవంత్ రెడ్డి కేరళకు వెళ్లి గొప్పలు చెప్పుకుంటున్నారని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చాక పదేళ్ల పాటు కేసీఆర్ ప్రజలను మోసం చేస్తే, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే పని చేస్తున్నారని ఆరోపించారు. బీసీలకు ఏదో చేశామని కాంగ్రెస్ పార్టీ చెబుతోందని, అదేమిటో చెప్పాలని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు.

# నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!

వివాహ జీవితం సుఖంగా సాగాలంటే ప్రేమ, గౌరవం, నమ్మకం, క్షమ, సానుభూతి వంటి విలువలతో నిండిన అనుబంధం కావాలి. ఇందుకు సద్గురు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విలువలు జీవిత భాగస్వాముల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా.. జీవితాన్ని సంతోషంగా జీవించడానికి ఉపయోగపడతాయి. వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతలో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది.ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన



హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది. సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.

## అరటి ఆకులో భోజనం దీని వెనుక అసలు కారణం ఇదే

మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు ప్రతి పండగ, వేడుకలో అరటి ఆకుల్లో భోజనం చేయడం కనిపిస్తుంది. పురాతన కాలం నుంచి అరటి ఆకులను వివిధ ఆచారాలు, వేడుకలు, రోజువారీ ఆహారంలో మనోళ్లు ఉపయోగిస్తున్నారు. మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. ఆకులు కడగడం నుంచి చివరికి తినడం, ఆకులు మడతపెట్టడం వరకు కొన్ని ఆచారాలు ఉన్నాయి. తినడానికి ముందు అరటి ఆకుపై నీళ్లు చల్లడం శతాబ్దాల నాటి ఆచారం. దీనికి వివిధ కారణాలు ఉన్నాయి. అరటి ఆకులు సహజంగా కీటకాలు, సూక్ష్మజీవులను కలిగి ఉంటాయి. నీటితో చల్లడం, శుభ్రపరచడం వల్ల ఆకులపై ఉన్న కీటకాలు, సూక్ష్మజీవులు చనిపోతాయి. ఆకులపై దుమ్ము, ధూళిని తొలగించి శుభ్రంగా ఉంచడానికి కూడా ఇలా చేస్తారు. అంతేకాకుండా నీటిని చల్లడం వల్ల ఆకులు గట్టిపడతాయి. ఇలా చేయడం వల్ల తినేటప్పుడు ఆకులు చిరిగిపోవడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాకుండా అరటి ఆకుపై నీరు చల్లడం చాలా పవిత్రమైన కార్యమని కూడా నమ్ముతారు. అరటి ఆకులో తిన్న తర్వాత దానిని లోపలికి మడతపెడతారు. అలా చేయడం ఆహారాన్ని తయారు చేసి వడ్డించిన వారికి గౌరవం చూపించే మార్గంగా పరిగణిస్తారు. కొన్నిసార్లు ఆహార అవశేషాలు ఆకు లోపలి భాగంలో ఉంటాయి. అందువల్ల ఆకును బయటి నుండి లోపలికి మడవటం వల్ల అవి జారి పోకుండా ఉంటాయి. అలాగే ఆకును లోపలికి మడతపెట్టడం వల్ల సూర్యరశ్మి దానిలోకి ప్రవేశించకుండా నిరోధిస్తుంది. దీనివల్ల అందులోని ఆహారం చెడిపోకుండా ఉంటుంది.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే

శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ




అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?



కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్తంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE






# 'రాకాస' మూవీ చూసిన వరుణ్ తేజ్ ఏమన్నారంటే..!

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా మారి తన అభిరుచికి తగ్గ చిత్రాలను నిర్మిస్తున్నారు. 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై ఆమె నిర్మించిన రెండో చిత్రం 'రాకాస'. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన ఈ సోషియో-ఫాంటసీ థ్రిల్లర్ నేడు థియేటర్లలోకి రానుంది. అయితే, నిన్న రాత్రి కొన్ని చోట్ల మూవీ ప్రీమియర్ షోలు పడ్డాయి. ఈ ప్రీమియర్ షోల నుంచే ఈ సినిమాకు మంచి టాక్ లభిస్తుండటం విశేషం. మానస శర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లవ్, కామెడీ, ఫాంటసీ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. సినిమా చూసిన నెటిజన్లు సోషల్ మీడియా ద్వారా తమ అభిప్రాయాలను పంచుకుంటూ పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. 'రాకాస' ఎంటర్?టైనింగ్?గా ఉంది.. సంగీత్ శోభన్ టాలెంట్ అద్భుతం: వరుణ్ తేజ్ తాజాగా ఈ సినిమాను వీక్షించిన నిహారిక సోదరుడు, హీరో వరుణ్ తేజ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తన రివ్యూ ఇచ్చారు. సినిమా ఎంతో వినోదాత్మకంగా ఉందని, ముఖ్యంగా కామెడీ అద్భుతంగా పండిందని ప్రశంసించారు. "'రాకాస' చూశాను, చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంది. కామెడీ ఈ సినిమాలో హైలైట్, నవ్వు ఆపుకోలేరు. సంగీత్ శోభన్ అద్భుతమైన టాలెంట్. వెన్నెల కిషోర్, గెటప్ శ్రీను అదరగొట్టేశారు. డైరెక్టర్ మానస శర్మ, నా స్టార్ ప్రొడ్యూసర్ నిహారికకు శుభాకాంక్షలు" అంటూ వరుణ్ తేజ్ పోస్ట్ చేశారు. వరుణ్ ప్రశంసతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# నా అహమే మా బంధానికి కారణం..

**ఐశ్వర్యతో బంధంపై అభిషేక్**



బాలీవుడ్ స్టార్ జంట అభిషేక్ బచ్చన్, ఐశ్వర్య రాయ్ బంధంపై ఎప్పటినుంచో రకరకాల ఊహాగానాలు వస్తూనే ఉన్నాయి. వీరిద్దరూ విడిపోతున్నారని, విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో తరచూ ప్రచారం జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో తన భార్య ఐశ్వర్యతో ఉన్న బంధం, కూతురు ఆరాధ్య పెంపకం గురించి అభిషేక్ బచ్చన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడారు. ఐశ్వర్యతో తన విజయవంతమైన భాగస్వామ్యానికి తన అహమే కారణమని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. లిల్లీ సింగ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... "నా తల్లిదండ్రులు పెళ్లి చేసుకున్నప్పుడు, మా నాన్న కంటే మా అమ్మే పెద్ద స్టార్. అందుకే భార్య విజయవంతంగా ఉండటం నాకు కొత్తేమీ కాదు. మా బంధం ఎప్పుడూ ఒక భాగస్వామ్యం లాంటిదే. కెరీర్ ప్రారంభం నుంచే నాకు ఐశ్వర్య తెలుసు. మేం మొదట్లో మంచి స్నేహితులం మాత్రమే" అని గుర్తు చేసుకున్నారు. 'అహం' అనే పదాన్ని ఆయన నెగటివ్ అర్థంలో వాడలేదు. "నేను గెలవాలంటే నా భాగస్వామి పరుగు ఆపాల్సిన అవసరం లేదని నేను నమ్ముతాను. నా భర్తృత్వాన్ని నిరూపించుకోవడానికి నా భార్య తన పనిని ఆపేయాల్సిన అవసరం లేని బంధం నాకు కావాలి. అదృష్టవశాత్తు ఐశ్వర్య కూడా అలా ఆలోచించదు. అందుకే మా బంధానికి నా అహమే కారణం అన్నాను" అని అభిషేక్ వివరించారు. తన తండ్రి అమితాబ్ బచ్చన్ తనను లాంచ్ చేయలేదని, కానీ తర్వాత తన కోసం 'పా' చిత్రాన్ని నిర్మించారని గుర్తుచేశారు. తమ కుమార్తె ఆరాధ్య బచ్చన్ పెంపకం గురించి మాట్లాడుతూ, అభిషేక్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "తల్లిదండ్రులలో తండ్రులు చాలా చెత్త టీచర్లు. ఎందుకంటే మా భావోద్వేగాలు అడ్డువస్తాయి. మహిళల్లో ఉండే సున్నితత్వం మాలో ఉండదు. మగవాళ్లు ఎక్కువగా చేతల ద్వారా తమను తాము నిరూపించుకోవాలనుకుంటారు" అని తెలిపారు. "మా ఇంట్లో, ఆరాధ్యకు మేమిద్దరం ఉత్తమ ఉదాహరణగా నిలవాలని ప్రయత్నిస్తాం. పిల్లలకు ఇది తప్పు, ఇది ఒప్పు అని చెప్పేకంటే, మన ప్రవర్తనతో వారికి ఆదర్శంగా నిలవాలి. తల్లిదండ్రులు నైతిక విలువలతో జీవించినప్పుడు, పిల్లలు కూడా వాటిని చూసి నేర్చుకుంటారు. ఆ విధంగానే వారిని భవిష్యత్తుకు సిద్ధం చేయాలి. మా ఇంట్లో ఎవరు మగాడు, ఎవరు ఆడ అనే పోటీ ఎప్పుడూ ఉండదు" అని ఆయన స్పష్టం చేశారు. కాగా, అభిషేక్, ఐశ్వర్య 2007 ఏప్రిల్ 20న వివాహం చేసుకున్నారు. ఈ ఏడాదితో వారి వైవాహిక బంధానికి 19 ఏళ్లు పూర్తి కానున్నాయి.



# ధనుష్ సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటాడు: సంయుక్త మీనన్

మలయాళ చిత్ర పరిశ్రమ నుండి వచ్చి, టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'గోల్డెన్ లెగ్'గా గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి... సంయుక్త మీనన్. బింబిసార, విరూపాక్ష వంటి చిత్రాలతో తెలుగు పరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పవర్ స్టార్ పవన్ చిత్రం 'భీమ్లా నాయక్'తో సంయుక్త రేంజ్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్లింది. తమిళనాడులో కూడా సంయుక్తకు భారీ ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... ధనుష్ సరసన 'సార్' (తమిళంలో వాతి) చిత్రంలో నటించిన అనుభవాన్ని ఆమె పంచుకుంది. "ధనుష్ తో పనిచేయడం నాకు ఒక గొప్ప పాఠం లాంటిది. ఆయన సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటారు. కానీ కెమెరా ముందుకు రాగానే అద్భుతమైన శక్తిని ప్రదర్శిస్తారు. ఆయన కథను ఎంచుకున్నారంటే అందులో కచ్చితంగా ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది" అని సంయుక్త ప్రశంసించింది. భవిష్యత్తులో మళ్ళీ ఆయనతో కలిసి నటించాలనే కోరికను ఆమె వ్యక్తం చేసింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'సార్' చిత్రం విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇందులో మీనాక్షి అనే బోటనీ లెక్చరర్ పాత్రలో సంయుక్త ఒదిగిపోయింది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథాబలమున్న సినిమాలను ఎంచుకోవడమే తన విజయ రహస్యమని ఆమె స్పష్టం చేసింది.

HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM